ప్రజల మాట ప్రగతి బాట

వికారాబాద్/కొడంగల్ నియోజకవర్గం

# కాంగ్రెస్, బీజేపీ మాయమాటలకు మోసపోవద్దు

## కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మద్దూర్ మండలంలోని రెనివెట్ల దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 24: కాంగ్రెస్‌తో కన్నీళ్లు తప్పవనేది కర్ణాటక ప్రజలను గమనిస్తే తెలుస్తున్నదని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని టేకల్‌కోడ్, అంగడిరైచూర్ గ్రామాలతో పాటు మద్దూర్ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పథకాలను, మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మాయమాటలకు మోసపోవద్దన్నారు. కరోనా వంటి గడ్డుకాలంలో వారు ఎక్కడ ఉన్నారో నిలదీయాలని పేర్కొన్నారు. ప్రజల కష్టాలు కాంగ్రెస్, బీజేపీ నాయకులకు పట్టవని, కేవలం ఎన్నికల సమయంలో వచ్చి మాయ మాటలు చెప్పి అధికారాన్ని దండుకోవడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. ఉనికి చాటుకునేందుకే కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంల డ్రామా చేస్తున్నదని, ఎన్నికల తరువాత వాటిని అమలు చేసే సత్తా కానీ నిబద్ధత కాని వారికి ఉండదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అభివృద్ధిని ప్రోత్సహించే పార్టీకే ఓటు వేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పాలనలోని 9 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఓ రోల్ మాడల్‌గా మారిందన్నారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకే అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్‌గా పేర్కొన్నారు. ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు గాను ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే తెలంగాణ మనుగడ సాధ్యపడుతుందని ప్రజల్లో పూర్తి విశ్వాసం ఏర్పడినట్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలతో పాటు పైసలకు అమ్ముడు పోయిన నాయకుల మోసపూరిత మాటలకు, ప్రవర్తనలకు ఆకర్షితులు కావద్దని, ఇటువంటి వారితో ఎప్పటికైనా ముప్పు తప్పదనే విషయాన్ని గ్రహించాలన్నారు.

# ఘనంగా దసరా ఉత్సవాలు

- అనంత పద్మనాభస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ఆనంద్
- అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు



వికారాబాద్: అనంతపద్మనాభ స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వికారాబాద్, అక్టోబర్ 24: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భావించే విజయదశమిని సోమవారం వికారాబాద్ పట్టణంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆలంపల్లి అనంతపద్మనాభస్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మంగళహారతులతో పూజలు చేశారు. స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించారు. ఎమ్మెల్యే ఆనంద్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేశ్‌కుమార్ పూజలు చేశారు. స్వామివారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే ఆనంద్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ పాల్గొన్నారు. వికారాబాద్ బోనమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రావణ ప్రతిమను దహనం చేసిన అనంతరం జమ్మిచెట్టుకు పూజలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు రామస్వామి, కిరణ్‌పటేల్, పావని, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ముద్ద దీప, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేణుగోపాల్, ఆలయ ఫౌండర్ పద్మనాభం, ఈవో నరేందర్ పాల్గొన్నారు.

**కొడంగల్:** దసరా వేడుకల్లో భాగంగా శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో అర్చకులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారు రాజావతారంలో అశ్వవాహనంపై ఊరేగింపుగా స్థానిక బస్టాండ్ సమీపంలోని పారువేట మండపానికి చేరుకున్నారు. పారువేట మండపంలో శమీ చెట్లకు అర్చకులు పూజలు నిర్వహించారు. అదేవిధంగా పారువేట మండపంలో కొలువుదీరిన స్వామి వారికి అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు.

**బొంరాస్‌పేట:** దసరా పండుగ సంబురాలను సోమవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దుర్గామాత దేవాలయాలు, మండ పాల్లో పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రజలు డప్పు చప్పుళ్ల మేళతాళాల మధ్య జమ్మి చెట్టు వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ పురోహితులు జోషి



కొడంగల్ : స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ శ్రావణ్‌గౌడ్, సంతోష్, సుభాష్‌రావు జమ్మి చెట్టుకు పూజలు చేసిన తరువాత జమ్మిని పంపిణీ చేశారు. దసరా పండుగ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. బంధువులు, మిత్రులకు జమ్మి ఆకులు ఇచ్చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నవరాత్రుల సందర్భంగా పలు గ్రామాల్లో ప్రతిష్టించిన దుర్గామాత విగ్రహాలను ఆనందోత్సాహాల మధ్య చెరువుల్లో నిమజ్జనం చేశారు.

**మర్పల్లి:** మండలంలోని కొంషెట్‌పల్లి, మర్పల్లి, పంచలింగాల్, పట్లూర్ తదితర గ్రామాల్లో తొమ్మిది రోజులుగా పూజలందుకున్న దుర్గమాత విగ్రహాలను మంగళవారం నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనాల్లో దుర్గమాత విగ్రహాలను ఊరే గింపు నిర్వహించి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు చేసిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వికారాబాద్: జనసందోహం మధ్య రావణ దహనం



మర్పల్లి: దుర్గమాత ఊరేగింపులో మహిళలు, చిన్నారుల ఆటపాట



బొంరాస్‌పేట: జమ్మి వృక్షానికి పూజలు చేస్తున్న దృశ్యం

## బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలి



సమావేశానికి హాజరైన దళిత సంఘాల నాయకులు

బొంరాస్‌పేట, అక్టోబర్ 24 : దళిత సంఘాల నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దుద్యాల మండలం గౌరారంలో నిర్వహించిన నియోజకవర్గం దళిత సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దళితులు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి వారి జీవనోపాధికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేశారని, ఇలాంటి పథకం దేశంలోనే లేదన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతోనే సీఎం కేసీఆర్ వారికి అండగా ఉంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాల మాటలను నమ్మకుండా బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నరేందర్‌రెడ్డి కోరారు.

**బీఆర్‌ఎస్‌కే మా మద్దతు**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం ద్వారా ఆర్థికంగా లబ్ధిపొందిన తాము వచ్చే ఎన్నికల్లో కొడంగల్‌లో ఎమ్మె ల్యే పట్నం నరేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్ధతు తెలుపుతామని దళిత సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు సంఘాల నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వీరిని ఎమ్మెల్యేఅభినందించారు. కార్యక్రమంలో దుద్యాల, బొంరాస్‌పేట మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు చాంద్‌పాషా, కోట్ల యాద గిరి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నియోజకవర్గంలోని దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నాగారంలో బీఆర్‌ఎస్ ప్రచారం



నాగారంలో మాట్లాడుతున్న పార్టీ మండల నాయకులు

ధారూరు,అక్టోబర్ 24: మండల పరిధిలోని నాగారం గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పార్టీ మ్యానిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్‌లో పార్టీ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్‌ను భారీ మెజారిటీతో గెలుపించుకుందామని తెలిపారు. ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటు వేసి ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజూనాయక్, ప్రధాన కార్యదర్శి రాజుగుప్తా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంతోష్‌కుమార్, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, నరోత్తం రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఖుదరత్ అలీ, ఖాసీమ్, బాబయ్యా, మల్లేశం, గోపాల్, రాములు, లక్ష్మన్, రాజు పాల్గొన్నారు.

## డీఆర్సీ సెంటర్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్



కొడంగల్, అక్టోబర్ 24: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్సీ సెంటర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సందర్శించారు. పోలింగ్ అనంతరం ఈవీఎం మిషన్లను భద్రపరిచే ప్రక్రియను అధికారులకు వివరించడంతో పాటు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పట్టణ శివా రులోని గుండ్లకుంట గ్రామ కూడలిలో వాహనాలను తనిఖీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ భరత్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.